క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


అవగాహన కల్పిస్తున్న గుంటూరు జోనల్ అధికారి

కనిగిరిరూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని మలేరియా శాఖ గుంటూరు జోనల్ అధికారి జి.వీర్రాజు అన్నారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో పట్టణంలోని ఏబీఎంఎం కాంపౌండ్‌లో పాత డెంగీ కేసు నమోదైన ఏరియాలో ఆయన పర్యటించారు. డెంగీ కేసు నమోదైన ఇంటిని పరిశీలించి, ఇంటి లోపల నీటిలో లార్వా గుర్తించారు. ఇంటి సభ్యులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, డీపీఎంఓ ప్రసాద్‌రెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు, ఏఎన్ఎం కృపావరం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మానిటర్ అందజేత

సీఎస్‌పురం(పామూరు): మండల పరిధిలోని నాగులవరం ప్రాథమిక పాఠశాలకు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు రూ.10 వేల విలువైన మానిటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అవసరాల నిమిత్తం అందజేశామన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి ఆదిలక్ష్మి

టంగుటూరు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. గ్రామస్తులను గ్రంథాలయ సభ్యులుగా చేర్పి గ్రంథాలయ సెస్ కట్టించాలన్నారు. గ్రంథాలయం, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని గ్రంథపాలకుడు వర్ధనరాజును సూచించారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ


విద్యార్థులకు కళ్లజోళ్ళు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కొండపి: రావూరి వినీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రావూరి తిరుమల రాధాకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు పాఠశాలల విద్యార్థులకు 600కి పైగా కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజకుమార్, చంద్రశేకర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌అరుణ, పెట్లూరు పీహెచ్‌సీ సూపర్ వైజర్ లక్ష్మీ నరసింహ, ఫౌండేషన్ సభ్యులు గోపిసాయి కృష్ణ, వాసు పాల్గొన్నారు.

హెల్మెట్ ప్రాణానికి రక్ష


ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: హెల్మెట్ ప్రాణానికి భద్రత ఇస్తుందని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. సర్కిల్ పరిధిలో హెల్మెట్ వాడకంపై గురువారం అవగాహన కల్పించి వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో కొండపిలో 50 మందికి, మర్రిపూడిలో 20 మందికి, పొన్నలూరులో 50 మంది ద్విచక్రవాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గతంలో పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

సీఎస్‌పురం(పామూరు): సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని అరివేముల, కొండబోయినపల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. తొలుత సాగు చేసిన వరి, కంది పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసులు, అధికారులు శ్రీకాంత్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.


గుంతలమయంగా ఉన్న పాకల రోడ్డు


ఉత్తర బైపాస్‌రోడ్డు మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతలు


అధ్వాన్నంగా ఉన్న కలికవాయ- నందనవనం రహదారి

అడుగుకో గుంత.. అడుగేసేదెట్లా..?

- గుంతల రోడ్లతో ప్రజల ఇక్కట్లు
- 10 నిమిషాల దూరానికి అరగంట ప్రయాణం
- గుంతలు పూడ్చుతున్నామని ప్రకటనలు తప్ప ఆచరణ శూన్యం

సింగరాయకొండ:

ఇటీవల వర్షాలు అడపా దడపా కురుస్తూనే ఉన్నాయి. దీంతో మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేవు. కానీ అధికారులు ఆ రోడ్ల గురించి పట్టించుకోపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ఏ గ్రామానికి వెళ్లాలన్నా గుంతల రోడ్లు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్ల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నారు.

అధ్వాన్నంగా గ్రామీణ రహదారులు

మండలంలోని శానంపూడి, పాకల, పాకల- ఊళ్ల పాలెం, కలికవాయ- నందనవనం రహదారులు గుంతలమయంగా మారి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. పాకల మార్గంలో బీచ్‌కు వెళ్లేవారు, గ్రామానికి వెళ్లేవారు, పొలం పనులకు వెళ్లే వారితో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. దీనికి తోడు గుంతల కారణంగా వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగి గాయాలు పాలవ్వాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. శానంపూడి రహదారి అయితే మరీ గుంతలమయంగా మారింది. వర్షం పడ్డప్పుడు అయితే మా ఇబ్బందులు మామూలుగా ఉండవని వాహనదారులు వాపోతున్నారు. జాతీయరహదారి నుంచి 10 నిముషాల్లో గ్రామానికి వెళ్లాల్సి ఉంటే సుమారు 30 నిమిషాలు సమయం పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి కందుకూరు వెళ్లే ఓవీ రోడ్డు కూడా గుంతల మయంగా అధ్వానంగా మారింది. కందుకూరు ఫ్లైఓవర్ దగ్గర అయితే రోడ్డు వర్షం నీరు పారే వీల్లేక నీరు నిలబడి రోడ్డు కోసుకు పోయి గుంతలు ఏర్పడ్డాయి. ఇక కలికవాయ నుంచి నందనవనం వెళ్లే రహదారి అయితే మరీ గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన నెలరోజుల్లోనే గుంతలు ఏర్పాడ్డాయని దీన్నిబట్టి రోడ్డును ఎంత నాణ్యంగా నిర్మించారో అర్థం అవుతుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరువాత అధికారులు తాత్కాలికంగా గుంతలు పూడుస్తున్నారే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని గుంతల రోడ్డే మాకు దిక్కయిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కందుకూరు ఫ్లైఓవర్ వద్ద రోడ్డు కోతకు గురైన దృశ్యం


అధ్వాన్నంగా ఉన్న శానంపూడి రహదారి

గుంతలు పూడ్చేదెప్పుడో?


గుంతలమయంగా ఉన్న ఓవీ రోడ్డు

రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామని నాయకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వటం తప్ప ప్రభుత్వం వచ్చి ఆరునెలలు అవుతున్నా ఒక్క రోడ్డు లో కూడా గుంతలు పూడ్చలేదు. ఇటీవల మండల కేంద్రంలోని ప్రధానరహదారిలో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టినా కేవలం మూడు రోజుల్లోనే కురిసిన వర్షాలకు మరల గుంతలు ఏర్పడ్డాయంటే పనులు ఎంత అధ్వానంగా చేశారో అర్థం చేసుకోవచ్చని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికయినా రోడ్ల గుంతలు పూడ్చి తమ ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు ఎదురుచూపులే గతి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


పొన్నలూరు మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల కోసం ప్రజలకు ఎదురుచూపులే మిగిలాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం నూతన కమిటీల నియామకంలో భాగంగా పొన్నలూరు మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఉద్దేశతో ప్రతి పిల్లవాడు చదువుకోవాలన్న లక్ష్యంతో అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమచేశారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం అంటూ ప్రతి పిల్లవానికి జమ చేస్తామని మోసపుహామీలతో గద్దెనెక్కి ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మార్కాపురంలో మెడికల్ కాలేజీని మంజూరు చేయించి డాక్టర్లు, సిబ్బందిని నియమించి ఎంతో ప్రతిష్టాత్మకంగా పనులు ప్రారంభించిందన్నారు. మెడికల్ కాలేజీకి 100 సీట్లు కావాలని కోరామని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీట్లు అవసరం లేదని చెప్పిందంటే..ఇంత కన్నా దుర్మార్గం ఇంకేముంటుందని ప్రశ్నించారు. గతంలో టీడీపీ 56 పేజీల మానిఫెస్టోను ప్రవేశపెట్టి ఒక్క పథకం కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. చివరకు టీడీపీ వెబ్‌సైట్ నుంచి మ్యానిఫెస్టోను తొలగించిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. ఎన్నికల సమయంలో అలివిమాలిన హామీలు ఇచ్చి..ఇప్పుడేమో నిధులు లేవని మొసలి కన్నీరు కారుస్తున్నారని, హామీలు ఇచ్చేటప్పుడు ఆ విషయం తెలీదా అని ప్రశ్నించారు.

గ్రామ వాలంటీర్ వ్యవస్థే లేదని సాక్షాత్తు గ్రామ వలంటీర్ శాఖా మంత్రి స్వామి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లేని వ్యవస్థకు మంత్రిగా స్వామిని చంద్రబాబు ఎలా నియమించారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అంతా డొల్లేనన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నా ఎక్కువ శాతం మంది లబ్ధిదారులు నగదు జమ కావడం లేదన్నారు. 2014లో మోసపోయిన ప్రజలు..మళ్లీ మోసపోయామని బాధపడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాస్టర్లను ఆదుకుందని, కానీ నేడు కూటమి ప్రభుత్వం వారిని గాలికి వదిలేసిందన్నారు.

సమష్టి నిర్ణయాలతోనే కమిటీల ఎంపిక...

మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో చర్చించి వారి అభీష్టం మేరకే నూతన కమిటీలను నియమిస్తామని, ఏకపక్ష నిర్ణయాలకు కాలం చెల్లిందని అన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయి, నియోజకవర్గస్థాయి, గ్రామస్థాయి కమిటీలను ఎంపిక చేస్తామని, మండల పార్టీ అధ్యక్షుడిని మాత్రం త్వరలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుని ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ప్రకటిస్తామన్నారు. ఆశావహులంతా అర్జీలు దాఖలు చేయవచ్చని, ఒక పదవికి ఎక్కువ మంది పోటీపడితే వారి మధ్య ఏకాభిప్రాయం కుదిర్చి ఎంపిక చేస్తామన్నారు. గతంలో లాగా నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు ఉండవని, గ్రూపులను సహించేది లేదన్నారు. నియోజకవర్గంలో సమష్టిగా పార్టీ పనిచేస్తుందని ఏకాభిప్రాయంతోనే పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో కొండపి గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీ నాయకుడిలా పొన్నలూరు ఎస్సై..

ఎస్పీ ఏఆర్ దామోదర్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అని చెబుతుంటే పొన్నలూరు ఎస్సై మాత్రం ఎస్పీ సూచనలు పాటించడం లేదని మండల నాయకులు మాజీ మంత్రి సురేష్ దృష్టికి తీసుకుని వచ్చారు. వినాయక నిమజ్జనం ఘటనలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లను విడుదల చేయమని కోర్టు ఆదేశిస్తే ఎస్సై మాత్రం మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పుకున్నాడని ఆరోపించారు. స్టేషన్‌కు వెళితే అసభ్యపదజాలంతో దూషిస్తున్నాడని, టీడీపీ నాయకుడిగా పనిచేస్తున్నాడే గానీ ఎస్సైగా విధులు నిర్వర్తించడం లేదని ఆరోపించారు. తల్లి మరణ ధ్రువీకరణ పత్రం కోసం వెళితే టీడీపీ నాయకుడి అనుమతి కావాలని ఓ అధికారి బెదిరిస్తున్నాడని మాజీ మంత్రి సురేష్ దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇంటికే వస్తే..కూటమీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు చెప్పిన వారికే అన్నీ జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

సింగరాయకొండ: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈ నెల 21న ఘనంగా నిర్వహించాలని పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. పండుగలా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నాగేశ్వరరెడ్డి భౌతికకాయానికి దద్దాల నివాళి


నాగేశ్వరరెడ్డికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రానికి చెందిన గూడపు నాగేశ్వరరెడ్డి భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, ఎస్సీ సెల్ నాయకుడు కటికల వెంకటరత్నం, బైరెడ్డి తిరుపతి రెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజ్, మాజీ సర్పంచ్ పులిమి ఆదినారాయణ, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలరెడ్డి, బోయమడుగు సర్పంచ్ బొట్ల చిరంజీవి, సంగిశెట్టి వాసు, బోయిన కొండయ్య, తోట రమేష్, సమీరా, సమీర్, ఎలికా, వినోద్, గొబ్బిళ్ల శీను, వాకముల రాజశేఖర్ రెడ్డి, సంగటి మహేంద్ర పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


బసిరెడ్డి కళ్యాణి

కనిగిరిరూరల్: కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21 నుంచి 25 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగే 68వ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో కంచర్లవారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని బసిరెడ్డి కళ్యాణి రాష్ట్ర ఖోఖో జట్టులో ఆడనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గత నెల 2 నుంచి 4 వరకు అనకాపల్లి జిల్లా తుమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారిణి బి.కళ్యాణిని ఖోఖో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, పాఠశాల పీడీ భవనం కాశీ విశ్వనాథరెడ్డి, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ మల్లెల పిచ్చయ్య, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

కార్డన్ సెర్చ్‌లో 33 వాహనాలు స్వాధీనం


కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని బాలిరెడ్డినగర్‌లో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 32 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో డీఎస్పీ మాట్లాడుతూ తనిఖీల్లో మారణాయుధాలు, గంజాయి వంటివి లభ్యం కాలేదన్నారు. సంఘ విద్రోహులను కనిపెట్టడానికి డాగ్ స్క్వాడ్ కూడా ఉపయోగించామన్నారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని ఒక సీఐ, ఆరుగురు ఎస్సైలు, 70 మంది సిబ్బంది పాల్గొన్నారన్నారు. సీజ్ చేసిన వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు ఇస్తే వాటిని వాహన యజమానులకు ఇస్తామన్నారు. తనిఖీల్లో డ్రోన్‌లను ఉపయోగించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారని ఈ డ్రోన్ కెమెరా వలన 10 కిలోమీటర్ల దూరంలో పారిపోయే వ్యక్తిని కనిపెట్టి పట్టుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎవరిని కించపరిచే ఉద్దేశం లేదని, ఒక లక్ష్యంతో చేస్తున్న కార్యక్రమం కావున ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని సూచించారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, అక్రమ మద్యం అమ్మకాల సమాచారాలు తెలియజేయాలని సూచించారు. ఎస్సై బి.మహేంద్ర, ఎస్సై నాగమల్లేశ్వరరావులు, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వైద్యానికి ఆర్థిక సాయం


రవికుమార్ కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న ఎస్సై కోటయ్య

వీసీపల్లి: కానిస్టేబుల్ వైద్య ఖర్చులకు రూ.70 వేల ఆర్థికసాయం అందజేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవికుమార్ ఇటీవల విధులు నిర్వహిస్తూ ఆకస్మాత్తుగా రోడ్డుపై పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి..అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం మంగళగిరికి తరలించారు. కానిస్టేబుల్ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎస్సై దాతల సాయంతో రూ.70 వేల వసూలు చేసి రవి కుటుంబసభ్యులకు అందజేశారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

కొండపి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఎంపీడీఓ మాట్లాడారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


దుస్తులు పంపిణీ చేస్తున్న గూడూరి అబ్రహం లింకన్


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, సీఐ

కనిగిరిరూరల్: స్థానిక పామూరు బస్టాండ్‌లోని కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చిలోని ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ నాయకుడు, కో ఆప్షన్ సభ్యుడు గుడూరి అబ్రహ్మాం లింకర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేసి, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పాస్టర్లు గూడూరి జాన్ బంగారయ్య, గూడూరి రవి కుమార్, గూడూరి నేహామియా, కె.జోసెఫ్ సిద్ధార్థ్, పి.జేమ్స్, జీవరత్నం, ఏసురత్నం, యోహాన్ , యాకోబు కుంచం జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

600 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ

కనిగిరిరూరల్: స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్నేహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం స్థానిక పాతూరులో ఘనంగా నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి. సుధీర్.. తల్లి దండ్రులు మోహన్‌రావు, కృపమ్మల జ్ఞాపకార్థం సేవాహిత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో నిరుపేదలకు చేయూతనందిస్తున్న సుధీర్ సేవా నిరతిని కొనియాడారు. డాక్టర్ పెరుగు మురళీకృష్ణ మాట్లాడుతూ స్నేహస్తం సంస్థ ద్వారా నిరాశ్రయులకు చేయూతనివ్వడాన్ని అభినందించారు. అనంతరం 600 మంది పేదలకు, అనాథలకు దుప్పట్లు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో హెల్ప్ సంస్థ ప్రతినిధి బీవీ సాగర్, దళిత హక్కుల వేదిక అధ్యక్షుడు దూళిపాళ్ల మల్లికార్జునరావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

దుస్తులు, పండ్లు పంపిణీ

కొండపి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలో స్థానిక బస్టాండ్ సమీపంలో హెచ్ఎస్‌పీఎం చర్చి ఆధ్వర్యంలో గురువారం 500 మందికి దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేయడం ఆనందకరమన్నారు. స్థానిక సంఘ కాపరి బి.ప్రభుదాస్, సాల్మన్ పాస్టర్, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కొర్నేలు, సువార్త రాజు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం


టంగుటూరులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ చిడిపోతు ప్రసాద్

టంగుటూరు: మద్యం మత్తులో కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన టంగుటూరు వడ్డేపాలెంలో గురువారం జరిగింది. స్థానికులు వివరాల మేరకు..టంగుటూరు వడ్డేపాలెనికి చెందిన చిడిపోతు ప్రసాద్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గొంతు, చేతులపై కత్తితో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పీహెచ్‌సీకి తరలించగా..అక్కడ ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

టంగుటూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు కించపరిచేలా ఉన్నాయని, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తులిబిల్లి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ పార్కులో గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలోనూ అంటరానితనాన్ని, ఆర్థిక, సామాజిక వెలివేతల నుంచి ఏ దేవుడు కాపాడలేదని, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే దళితులకు రక్షణ కల్పించిందన్నారు. జై భీంరావ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ కృష్ణారావు, బొడ్డు సతీష్, చంద్రబాబు, నూకతోటి పేరయ్య, రాజు, శ్రీను, వినయ్, రిషి, గూడూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

టంగుటూరు: పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ అన్నారు. మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఎమ్మార్సీ కార్యాలయాన్ని డీఈఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పదో తరగతి విద్యార్థులతో సిలబస్, 100 రోజుల ప్రణాళిక గురించి మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయుల ప్రణాళికను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మార్సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఆర్పీలతో ఎస్ఏ 1 పరీక్షల నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్ నుంచి రెండుపూటలా ప్రశ్నాపత్రాలు ఏ విధంగా తీసుకువస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట డీసీఈబీ సెక్రటరీ మర్రి శ్రీనివాస్, ఎంఈఓలు చెంచుపున్నయ్య, తన్నీరు బాలాజీ, ప్రధానోపాధ్యాయులు కొండపి శ్రీనివాస్ పాల్గొన్నారు.